క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

ఆసిఫాబాద్: జిల్లా కేంద్రంలోని బాపూనగర్, వివేకానందచౌక్, గాంధీచౌక్, బజార్‌వాడి, జమామసీద్ ప్రాంతంలో ఆదివారం ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ట్రాన్స్‌కో ఏఈ లక్ష్మిరాజం ఒక ప్రకటనలో తెలిపారు. పట్టణంలో విద్యుత్ లైన్ మరమ్మతులో భాగంగా పాత వైర్ స్థానంలో కొత్త వైర్ లాగడం కోసం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు, వినియోగదారులు సహకరించాలని కోరారు.

కౌటాల: కౌటాల 132 కేవీ టవర్‌లైన్ పనుల్లో భాగంగా ఆదివారం పలు మండలాలకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు కౌటాల ఏడీఈ రాజేశ్వర్ శనివారం తెలిపారు. టవర్ లైన్ పనుల కారణంగా నేడు కౌటాల, చింతలమానెపల్లి, బెజ్జూర్ మండలాల్లోని గ్రామాలకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని తెలిపారు. నేడు మధ్యాహ్నం 12 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఐదు గంటల పాటు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు తెలిపారు. ఆయా మండలాల్లోని విద్యుత్ వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు.

'దురుసుగా ప్రవర్తించడం సరికాదు'

తిర్యాణి: వివిధ పనుల రీత్యా తహసీల్దార్ కార్యాలయానికి వచ్చే ప్రజలపై ఓ అధికారి దురుసుగా ప్రవరిస్తున్నాడని ఆదివాసీ సంఘం కుర్సెంగ శోభన్ ఆరోపించారు. శనివారం మండల కేంద్రంలో ఆయన విలేకర్లతో మాట్లాడుతూ కార్యాలయానికి దోతి, పంచె కట్టుకుని పనులు చేయమని వస్తే సదరు అధికారి అవమానపరుస్తున్నాడన్నారు. ఇప్పటికైనా అధికారులు తీరు మార్చుకోకపోతే కలెక్టర్‌కు ఫిర్యాదు చేయడంతో పాటు ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు.

మహర్ యువజన సమావేశం



సమావేశంలో మహర్ యువజన సభ్యులు

చింతలమానెపల్లి: మండల మహర్ యువజన సంఘం ఆధ్వర్యంలో శనివారం సమావేశం నిర్వహించారు. స్థానిక అంబేద్కర్ కమ్యూనిటీ భవనంలో నిర్వహించిన సమావేశంలో యువజన సంఘం ఆధ్వర్యంలో పలు నిర్ణయాలు తీసుకున్నారు. ఈనెల 3న నూతన కమిటీ ఏర్పాటు చేయనున్నట్లు సభ్యులు తెలిపారు. కమిటీ ఏర్పాటుకు అందరూ హాజరై విజయవంతం చేయాలని కోరారు. అంబేద్కర్ ఆశయ సాధనకు పాటుపడే దిశగా కృషి చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సంఘం సభ్యులు, నాయకులు పాల్గొన్నారు.

మిస్సింగ్ కేసు నమోదు

తిర్యాణి: మండలంలోని గోపెర పంచాయతీ పరిధి హీరనాయక్ తండాకు చెందిన పవర్ అంబాజీ(35) అనే వ్యక్తి అదృశ్యంపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై శ్రీకాంత్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం అంబాజీ గత నెల 28న లింగాపూర్ మండల కేంద్రంలోని బ్యాంకు నుంచి డబ్బులు తీసుకొస్తానని చెప్పి వెళ్లి ఇంటికి తిరిగి రాలేదు. ఎక్కడ వెతికినా ఆచూకీ లభించకపోవడంతో శనివారం అంబాజీ కుమారుడు కృష్ణ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపడుతున్నట్లు ఎస్సై తెలిపారు.

పరీక్ష సామగ్రి పంపిణీ

నార్నూర్ మండలంలోని తడిహడప్నూర్ ఆశ్రమ ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుతున్న విద్యార్థులకు ఐటీడీఏ ద్వారా అందించిన పరీక్ష సామగ్రిని శనివారం పాఠశాల ప్రధానోపాధ్యాయులు బలిరామ్ రాథోడ్, వార్డెన్ అమిత్ కుమార్ చేతుల మీదుగా పంపిణీ చేశారు. 30 మంది విద్యార్థులకు ప్యాడ్‌లు, పెన్నులు, చేతి గడియారం, స్కేల్స్, నోట్‌బుక్స్, జామిట్రీ బాక్సులు అందజేశారు. కార్యక్రమంలో కుమ్ర తానాజీ, జాదవ్ పరశురామ్, పవార్ బలరాం, జాదవ్ రాజేశ్‌బాబు, కవన కోకిల బంకట్‌లాల్ పాల్గొన్నారు.

సంక్షేమ ఫలాలు సద్వినియోగం చేసుకోవాలి

ఆదిలాబాద్‌టౌన్: కార్మికశాఖ ద్వారా అందే సంక్షేమ ఫలాలను భవన నిర్మాణ కార్మికులు సద్వినియోగం చేసుకోవాలని ఏఐటీయూసీ అనుబంధ భవన నిర్మాణ కార్మిక సంఘం రాష్ట్ర నాయకులు గాజెంగుల రాజు అన్నారు. ఈనెల 11న జిల్లా కేంద్రంలో నిర్వహించే మహాసభను జయప్రదం చేయాలని శనివారం ప్రచారం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ లేబర్‌కార్డు లేని వారికి కార్డులు జారీ చేసేలా కార్మిక శాఖ ప్రత్యేక క్యాంపులు నిర్వహించాలని డిమాండ్ చేశారు. వేలిముద్ర రెన్యూవల్ చేస్తున్నారని, కార్మికుల వేలిముద్రలు రాని కారణంగా ఇబ్బందులు వస్తున్నాయన్నారు. కార్మికుల హక్కుల సాధన కోసం కార్యాచరణ రూపొందించడానికి మహాసభకు భారీ సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు.

క్షేత్రపర్యటనలో విద్యార్థులు



పెంచికల్‌పేట్: పెంచికల్‌పేట్ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులు పీఎంశ్రీ కార్యక్రమంలో భాగంగా వరంగల్ జిల్లాలో క్షేత్రపర్యటనకు వెళ్లారు. రామప్ప ఆలయం, లక్నవరం సరస్సు, వేయిస్తంభాల గుడి, భద్రకాళి ఆలయాల్లో పర్యటించారు. కాకతీయుల కాలంలో చెరువుల నిర్మాణం, శిల్పకళా నైపుణ్యాలు, కాకతీయుల పాలన వివరాలను నమోదు చేసుకున్నారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం విజయనిర్మల, ఉపాధ్యాయులు యాదగిరి, బడేసాహెబ్, లక్ష్మి, సంతోష్, భారతి, అఫ్తాబ్, ధన్‌రాజ్, ఆత్మరాం, భాగ్యశ్రీ, విద్యార్థులు పాల్గొన్నారు.

హనుమాన్ దీక్షలు ప్రారంభం



ఆసిఫాబాద్‌అర్బన్: ఏప్రిల్ 12వ తేదీన హనుమాన్ జయంతి పురస్కరించుకుని శనివారం జిల్లా కేంద్రంలోని కేస్లాపూర్ హనుమాన్ ఆలయంలో 25 మంది భక్తులు 41 రోజుల పాటు మండల దీక్ష స్వీకరించారు. ఈ సందర్భంగా అర్చకులు ఒజ్జల శిరీష్‌శర్మ ఆధ్వర్యంలో ఆలయంలో స్వామివారికి అభిషేకం, నవగ్రహ స్థాపన పూజ, మన్యుసూక్తం, ప్రత్యేక పూజలు, హోమకార్యక్రమాన్ని నిర్వహించి, అనంతరం భక్తులకు మాలధారణ చేశారు. అనంతరం దీక్షా సమయంలో పాటించాల్సిన నియమాలు వివరించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు గుండా వెంకన్న, పిన్నా వివేక్, వనం మధు, నారాయణమూర్తి, సుధాకర్, జీవన్, తేజ, యాదగిరి, క్రుపాల్, సురేశ్, స్వాములు, భక్తులు పాల్గొన్నారు.

విద్య బహుదూరం!

- విద్యావసతులకు నోచుకోని 'చింతలమానెపల్లి'
- ప్రయాణభారంతో విద్యార్థుల తిప్పలు
- పట్టించుకోని అధికారులు



మండలంలోని గూడెం పాఠశాల

చింతలమానెపల్లి: మండలంలోని విద్యార్థులకు చదువు భారంగా మారుతోంది. విద్యను అభ్యసించేందుకు దూరాన్ని భరించాల్సిన పరిస్థితి వారిది. విద్యాభివృద్ధి కోసం కోట్ల రూపాయలను ప్రభుత్వం కేటాయిస్తున్నా క్షేత్రస్థాయికి ఫలాలు చేరడం లేదు. మండలంలోని గూడెం పాఠశాలను పదేళ్ల క్రితం ప్రాథమికోన్నత పాఠశాల నుంచి ఉన్నత పాఠశాలగా మారుస్తూ ఉత్తర్వులు ఇచ్చారు. కానీ పాఠశాలను 9వ తరగతికి మాత్రం అప్‌గ్రేడ్ చేయడం లేదు. దీంతో ఇక్కడ 8వ తరగతి విద్యాభ్యాసం తరువాత విద్యార్థులు గూడెం గ్రామం నుంచి సుమారు 20కిలోమీటర్ల దూరంలోని మండల కేంద్రానికి వెళ్లాల్సి వస్తోంది. చింతలమానెపల్లి మండలంగా ఏర్పాటై 10 సంవత్సరాలు దాటింది. కానీ నేటికీ మండలంలో ఇంటర్మీడియెట్ కళాశాల ఏర్పాటు చేయలేదు. మండల వ్యాప్తంగా ఏటా 400మందికిపైగా విద్యార్థులు ఇంటర్ విద్యకోసం దూరప్రాంతాలకు వెళ్తున్నారు.

ఇంటర్‌కు 40 కిలోమీటర్లు..

మండలంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల లేకపోవడం విద్యార్థుల చదువుకు ఆటంకంగా మారింది. ఏటా ఇక్కడి విద్యార్థులు ఇంటర్ విద్యకోసం పొరుగు మండలం కౌటాల లేదా ఇతర ప్రాంతాలకు వెళ్తున్నారు. మండలంలోని కోయపెల్లి గ్రామ పంచాయితీ నుంచి కౌటాల మండల కేంద్రం సుమారుగా 40 కిలోమీటర్ల దూరం ఉండడం గమనార్హం.

అధికారుల నిర్లక్ష్యం..

మండలంలోని గూడెం పాఠశాలను గత 10 సంవత్సరాల క్రితం ఉన్నత పాఠశాలగా మారుస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. కాగా అప్పటి సిబ్బంది పాఠశాలలో 10వ తరగతిని ఏర్పాటు చేయడానికి అవసరమైన నిబంధనలు పాటించక పోవడంతో ఉత్తర్వులు నిలిచిపోయాయి. దీనికి తోడు పాఠశాల పోలీస్‌స్టేషన్‌కు దూరంగా ఉందని, పీజీ స్థాయి ప్రధానోపాధ్యాయుడు లేదని, తగిన ఉపాధ్యాయులు లేరనే కారణాలతో పాఠశాలలో 9, 10వ తరగతులను అప్పటి అధికారులు మంజూరు చేయలేదు. పాఠశాలలో 10వ తరగతి వరకు తరగతులను నిర్వహించేందుకు సరిపడా వసతులు ఉన్నాయి. ప్రస్తుతం స్కూల్ అసిస్టెంట్ స్థాయి ప్రధానోపాధ్యాయుడు విధులు నిర్వహిస్తుండగా పీజీ హెచ్‌ఎం పోస్ట్ మంజూరైంది. అయినప్పటికీ ఉన్నతాధికారులు అప్‌గ్రేడ్ చేసేందుకు చర్యలు తీసుకోవడం లేదనే ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. విద్యార్థులు 10, ఇంటర్ పరీక్షలకు హాజరు కావడానికి చాలా దూరం ప్రయాణించాల్సి వస్తోంది. 10వ తరగతి పరీక్ష కేంద్రం మండల కేంద్రంలో ఉన్నా ఇంటర్ పరీక్షలకు మాత్రం ఇబ్బందులు తప్పేలా లేవు. మండలంలో మరిన్ని ఉన్నత పాఠశాలలు, ఇంటర్మీడియెట్ కళాశాల ఏర్పాటు చేయాలని మండల ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

'పది'కి 20 కిలోమీటర్ల ప్రయాణం..

గూడెం గ్రామంలోని విద్యార్థులు 10వ తరగతి చదువుకోవాలంటే సుమారు 20కిలోమీటర్ల దూరం ప్రయాణించాల్సి రావడం ఇక్కడి విద్యా వసతుల పరిస్థితికి నిదర్శనంగా నిలుస్తోంది. గూడెం గ్రామ పంచాయితీ సమీపంలో ఉన్న శివపెల్లి, బూరుగూడ, కోయపెల్లి, దిందా, చిత్తామ గ్రామాలలో 9, 10వ తరగతులకు సంబంధించి సుమారు 100మందికి పైగా విద్యార్థులు మండల కేంద్రం లేదా కౌటాలలోని ప్రైవేట్ పాఠశాలల్లో చదువుతున్నారు. స్థానికంగా ఉన్నత విద్య లేకపోవడంతో ఆడపిల్లలను చదువు మాన్పించే పరిస్థితులు ఎదురవుతున్నాయని తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గూడెంతో పాటు రణవెల్లి, రుద్రాపూర్ గ్రామాలలో పాఠశాలలను ఉన్నత పాఠశాలలుగా అప్‌గ్రేడ్ చేయాల్సిన అవసరం ఉంది.

ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి

మండలంలోని గూడెం గ్రామంలో ఉన్నత పాఠశాలలో 10వ తరగతి ఏర్పాటు చేయాలి. విద్యార్థులు నానా ఇబ్బందులకు గురవుతున్నారు. ప్రతీరోజు దూర ప్రయాణం విద్యార్థులకు భారంగా మారుతోంది. అధికారులు చర్యలు తీసుకోవాలి.

– బుర్రి రూపేశ్, విద్యార్థి నాయకుడు, గూడెం

నివేదికలు అందించాం..

గూడెం గ్రామంలో 10వ తరగతి వరకు తరగతుల నిర్వహణకు గతంలో నివేదించాం. ఈ ఏడాది సైతం నివేదిక అందించాం. రణవెల్లి, గూడెం, రుద్రాపూర్ పాఠశాలలపై వివరాలు అందజేశాం. ఆర్‌జేడీ కార్యాలయం నుంచి అనుమతులు రావాల్సి ఉంది. ఈ ఏడాది మంజూరయ్యేలా కృషి చేస్తున్నాం.

– జయరాజ్, మండల విద్యాధికారి

ఘనంగా సైన్స్ దినోత్సవం



సైన్స్ ప్రాజెక్టును పరిశీలిస్తున్న ఉపాధ్యాయులు

వాంకిడి: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జాతీయ సైన్స్ దినోత్సవాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. పాఠశాల విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని సైన్స్ ప్రాజెక్టులు, ప్రయోగాలను ఆవిష్కరించి ప్రదర్శించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మండల విద్యాధికారి శివచరణ్ పాల్గొని మాట్లాడారు. విద్యార్థులు ప్రాథమిక స్థాయి నుంచే నూతన ఆవిష్కరణలపై దృష్టి సారించాలని సూచించారు. ఏది సాధించాలన్నా విద్యతోనే సాధ్యపడుతుందని, ఉన్నత చదువు అత్యున్నత లక్ష్యాలకు మార్గాలను చూపిస్తుందని సూచించారు. సైన్స్ ఆవిష్కరణలో ఉత్తమ ప్రతిభ కనబర్చిన విద్యార్థులను అభినందించారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం నటరాజ్, ఉపాధ్యాయులు నాగరాజ్, వెంకటరావు, సంతోష్, మమత, కళ్యాణి, అరుంధతి తదితరులు పాల్గొన్నారు.



సైన్స్ ప్రాజెక్టులతో విద్యార్థినులు

'పది' విద్యార్థులకు అవగాహన సదస్సు

పెంచికల్‌పేట్: చేడ్వాయి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం ఉమ్మడి పరీక్షల బోర్డు మాజీ జిల్లా కార్యదర్శి వై. శంకరయ్య ఆధ్వర్యంలో పదో తరగతి విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ రానున్న వార్షిక పరీక్షల్లో విద్యార్థులు పాటించాల్సిన మెలుకువలు వివరించారు. పరీక్ష సమయంలో విద్యార్థులు పాటించాల్సిన జాగ్రత్తలను తెలియజేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎం రమేశ్‌బాబు, ఉపాధ్యాయులు రాకేశ్, సంతోష్, తాజ్‌పాషా, రాజ్‌కమలాకర్‌రెడ్డి, శిల్ప, ద్రుపదబాయి, సుమిత విద్యార్థులు పాల్గొన్నారు.



పదో తరగతి విద్యార్థులతో ఉపాధ్యాయులు

తాగునీటి సమస్య తీర్చాలి



మాట్లాడుతున్న బీజేపీ నాయకుడు ఖాండ్రే విశాల్

ఆసిఫాబాద్‌అర్బన్: జిల్లా కేంద్రంలోని బ్రాహ్మణవాడ, గంగపుత్ర కాలనీల్లో గత 15 రోజులుగా మిషన్ భగీరథ నీటిని సరఫరా చేయకపోడంతో కాలనీవాసులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, నీటి సమస్య పరిష్కరించాలని బీజేపీ జిల్లా నాయకుడు ఖాండ్రె విశాల్ డిమాండ్ చేశారు. శనివారం జిల్లా కేంద్రంలోని బ్రాహ్మణవాడలో కాలనీవాసులతో కలిసి ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. అసలే వేసవి కాలం, దానికి తోడు తాగునీటి సరఫరా నిలిచిపోవడంతో కిలోమీటరు దూరం వరకు వెళ్లి నీటిని తీసుకురావాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. సంబంధిత అధికారుల దృష్టికి సమస్యను తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదని ఆరోపించారు. ఇప్పటికైనా వెంటనే తాగునీటిని కాలనీల్లో సరఫరా చేయాలని, లేని పక్షంలో మున్సిపల్, జిల్లా కలెక్టరేట్ కార్యాలయాల ఎదుట కాలనీవాసులతో కలిసి ధర్నా చేపడతామని హెచ్చరించారు. రాజమ్మ, చిరంజీవి, గౌరుబాయి, రాజు, సహస్ర, మెంగుబాయి తదితరులు పాల్గొన్నారు.

కష్టపడి చదివితేనే ఉజ్వల భవిష్యత్

నార్నూర్: మండల కేంద్రంలోని ఆదర్శ పాఠశాల పదో తరగతి విద్యార్థులకు శనివారం పీఏసీఎస్ డైరెక్టర్ దుర్గే కాంతారావు ఎస్‌ఆర్ కళాశాల ఆదిలాబాద్ వారి ఆధ్వర్యంలో పరీక్ష సామగ్రి అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పదో తరగతి పరీక్షలు సమీపిస్తున్న తరుణంలో విద్యార్థులు కష్టపడి ఇష్టంతో చదివితేనే ఉజ్వల భవిష్యత్ ఉంటుందన్నారు. సమయం ఎంతో విలువైందని, వృథా చేయవద్దని సూచించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపల్ ప్రశాంత్, ఎస్సార్ కళాశాల పీఆర్వో విజయ్, తదితరులు పాల్గొన్నారు.

రంజాన్ సరుకులు పంపిణీ

ఆదిలాబాద్‌టౌన్: పవిత్రరంజాన్ మాసాన్ని పురస్కరించుకొని నిరుపేద ముస్లిం కుటుంబాలకు సరకులను పంపిణీ చేస్తున్నట్లు సఫాబైతుల్ మాల్ అధ్యక్షుడు సయ్యద్ ముబషిర్ అహ్మద్ అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని టీఎన్‌జీవో గార్డెన్‌లో శనివారం నిరుపేదలకు నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రంజాన్ మాసంలో ఉపవాస దీక్షలు ఆచరించే పేద ముస్లిం కుటుంబాలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా వీటిని అందించడం జరిగిందన్నారు. కార్యక్రమంలో ఆదిలాబాద్ హజ్ సొసైటీ జిల్లా అధ్యక్షుడు షాహిద్ అహ్మద్ తవక్కల్, ముఫ్తి ముస్తఫా, హఫీజ్ బసీర్ అహ్మద్, హఫీజ్ ఖాసిమ్, అర్ఫాత్, మంజూర్ అహ్మద్ పాల్గొన్నారు.

ఘనంగా కళాశాల వార్షికోత్సవం



నృత్యం చేస్తున్న విద్యార్థినులు

వాంకిడి: మండల కేంద్రంలో శనివారం ప్రభుత్వ జూనియర్ కళాశాల వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని కళాశాల ప్రాంగణంలో సందడి చేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన నృత్య ప్రదర్శనలు, పాటలు, స్కిట్లు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ఉత్తమ ప్రదర్శన కనబర్చిన విద్యార్థులకు కళాశాల సిబ్బంది బహుమతులు ప్రదానం చేశారు. అనంతరం ప్రిన్సిపాల్ రాందాస్ మాట్లాడుతూ విద్యతో పాటు సాంస్కృతిక కార్యక్రమాలు వ్యక్తిత్వ వికాసానికి దోహదపడతాయన్నారు. వార్షిక పరీక్షల్లో ఉత్తమ ప్రతిభ కనబర్చి మంచి మార్కులు సాధించాలని విద్యార్థులకు సూచించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ చంద్రయ్య, అధ్యాపకులు శ్రీనివాస్, నవీన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

భాగవత్ కథ సప్తాహం ముగింపు



పాల్గొన్న మాజీ జెడ్పీ చెర్మన్ రాథోడ్ జనార్దన్

నార్నూర్: మండలంలోని భీంపూర్ శనీశ్వర ఆలయంలో మహాశివరాత్రి సందర్భంగా నిర్వహించిన భాగవత్ కథ (సప్తహ) శనివారం ముగిసింది. గ్రామస్తులు, మాజీ జెడ్పీ చెర్మన్ రాథోడ్ జనార్దన్ పాల్గొని పూజలు చేశారు. గ్రామంలో ఆధ్యాత్మిక భావంతో ఏర్పాటు చేసిన భాగవత కథ ప్రజల్లో ఎంతో మార్పు తీసుకువస్తుందన్నారు. ఆధ్యాత్మికంతోనే మానసిక ప్రశాంతత లభిస్తుందన్నారు. కార్యక్రమంలో నంగారాభేరి జిల్లా అధ్యక్షుడు జాదవ్ సంజీవ్ నాయక్, లంబాడా జేఏసీ నాయకులు నారాయణ, గ్రామపెద్దలు గులాబ్ మహరాజ్, పవార్ దేవిదాస్, గంగారాం నాయక్ పాల్గొన్నారు.

పద్మశాలీలు ఐక్యంగా ముందుకు సాగాలి



పోస్టర్ ఆవిష్కరిస్తున్న సంఘం నాయకులు

ఆసిఫాబాద్‌అర్బన్: పద్మశాలీలు ఐక్యంగా ఉంటూ ముందుకు సాగాలని సంఘం జిల్లా అధ్యక్షుడు ఇరుకుల అంజనేయులు అన్నారు. ఈనెల 9న హైదరాబాద్‌లోని ఎగ్జిబిషన్ గ్రౌండ్‌లో నిర్వహించే 17వ అఖిలభారత పద్మశాలీ మహాసభ, 8వ తెలంగాణ ప్రాంత పద్మశాలీ సంఘం మహాసభలకు సంబంధించిన పోస్టర్లను శనివారం జిల్లా కేంద్రంలో సంఘం నాయకులతో కలిసి ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ 1921లో అఖిల భారత పద్మశాలీ సంఘం స్థాపించి ఐక్యతను చాటుతూ దేశంలోనే బలమైన సంఘంగా ముందుకు సాగుతుందన్నారు. ఆచార్య కొండాలక్ష్మణ్ బాపూజీ మార్గదర్శకంలో ఆయన ఆశీస్సులతో ముందుకు వెళ్తున్నట్లు పేర్కొన్నారు. మహాసభకు జిల్లాలోని పద్మశాలీలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో సంఘం ప్రతినిధులు రాజయ్య, వెంకటేశ్, కనకయ్య, శంకర్, శ్రీకాంత్, లింగయ్య, తిరుపతి, రవీందర్, మోహన్, సురేశ్ తదితరులు పాల్గొన్నారు.

సూపరింటెండెంట్‌కు సన్మానం

ఆదిలాబాద్‌టౌన్: జిల్లా విద్య శాఖాధికారి కార్యాలయంలో సూపరింటెండెంట్‌గా పనిచేస్తూ ఉద్యోగ విరమణ పొందిన వెంకట రమణను జిల్లా విద్య శాఖ అధికారులు ఘనంగా సన్మానించారు. శనివారం డీఈవో కార్యాలయంలో ఆత్మీయ సన్మాన కార్యక్రమం నిర్వహించారు. డీఈవో ప్రణీత మాట్లాడుతూ.. ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం కృషి చేశారని కొనియాడారు.

పండ్లు పంపిణీ



పండ్లు పంపిణీ చేస్తున్న కోట్నాక విజయ్ కుమార్

వాంకిడి: ఆలయ ఫౌండేషన్ చైర్మన్ పరికిపండ్ల నరహరి జన్మదినాన్ని పురస్కరించుకుని సేవా కార్యక్రమాలు చేపడుతున్నట్లు జిల్లా ఆలయ ఫౌండేషన్, బీజేపి ఆసిఫాబాద్ నియోజకవర్గ ఇన్‌చార్జి కోట్నాక విజయ్ కుమార్ తెలిపారు. శనివారం మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు పండ్లు పంపిణీ చేశారు. ఫౌండేషన్ మండల ఇన్‌చార్జి వెంకటేశ్, ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.

జిల్లాకేంద్రంలో..

ఆసిఫాబాద్: జిల్లా కేంద్రంలోని ప్రభుత్వాసుపత్రిలో శనివారం ఆలయ ఫౌండేషన్ ఆధ్వర్యంలో రోగులకు పండ్లు పంపిణీ చేశారు. ఆలయ ఫౌండేషన్ వ్యవస్థాపకులు పరికిపండ్ల నరహరి జన్మదినం సందర్భంగా పండ్లు పంపిణీ చేసినట్లు ఫౌండేషన్ జిల్లా ఇన్‌చార్జి, బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జి కొట్నాక విజయ్‌కుమార్ తెలిపారు. నాయకులు సునీల్ చౌదరి, రాంబాబు, నాయకులు వెంకటేశ్వర్, రమేశ్, భగవంత్‌రావు పాల్గొన్నారు.

మైనార్టీల సంక్షేమానికి పెద్దపీట

ఆదిలాబాద్‌రూరల్: గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం హయాంలో మైనార్టీ సంక్షేమానికి పెద్దపీట వేసిందని మాజీ మంత్రి జోగు రామన్న అన్నారు. మొదట రంజాన్ ఉపవాసాల సందర్భంగా మాజీ మంత్రి జోగు రామన్న మైనార్టీ సోదరులకు రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. శనివారం మావల మండలంలోని పలు అభివృద్ధి పనులను జోగు రామన్న పరిశీలించారు. మైనార్టీ సంక్షేమానికి రూ. 17 కోట్లు మంజూరు చేసుకోవడం జరిగిందన్నారు. మైనార్టీ సంక్షేమానికి మైనార్టీ గురుకులాలను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. అనంతరం కమిటీ సభ్యులు జోగురామన్నను శాలువాతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో మదర్, అమిమ్ బాయ్, ఆసిఫ్ ఖాన్, ఆసీం బాయ్, జెమిల్, నాయకులు యూనుస్ అక్బానీ, సాజిదొద్దీన్, తదితరులు పాల్గొన్నారు.